

హంగూ, ఐశ్వర్యాలు జాతి భేదం
చూపకుండా అన్ని ఆదర్శాలనూ ఎలా
కబళిస్తాయో శిరీష చిత్రిస్తారు.

# కొత్త స్వరాలు

అప్పటికి గంటపైగా అయింది వాళ్ళిద్దరూ ఎదురుచూడడం ప్రారంభించి. సునీతకు విసుగ్గా, అలసటగా ఉంది. రవి ఒక్కడే నిర్భయంగా మాటాడలేడని లలిత బదులుగా తను వచ్చింది.

"వీరి మిసెస్ కూడా ఎమ్.ఎల్.ఎగా పోటీ చేస్తోంది ఆంటీ. అందుకే అటువైపు ఆ రష్. ఈ వరండా వైపు హాలులో ఈ సార్‌తో పనున్న వాళ్ళంతా వెడుతున్నారు. తింటే తిన్నారు గాని చాలా మంచి వ్యక్తి." రవి అన్నాడు.

"అవునవును. కంపాషనేట్ గ్రౌండ్‌లో ఇచ్చే ఉద్యోగం గురించి డీల్ చేయడానికి కూడా రేటు పెట్టిన..."

"హుష్.... అసలీ గవర్నమెంట్ అంతా అంతే ఆంటీ."

అదో రకంగా నవ్వి తల నొక్కుకుంటూ చుట్టూ చూసింది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్య ఆ బంగళా చాలా ముచ్చటగా, హుందాగా ఉంది. గేటు వరకూ నున్నగా వేసిన రోడ్డు. అటూ ఇటూ లాన్. మధ్య మధ్య ఎన్నో రకాల పూలమొక్కలు. ఒకవైపు పార్క్ చేసిన మారుతి వ్యాన్...ఆ ఇల్లూ...ఆ పరిసరాలూ చాలా అందంగా, అహ్లాదకరంగా, అంతకుమించి ఖరీదుగా ఉన్నాయి.

స్టేట్ గవర్నమెంట్‌లో తను ఉద్యోగం వదలేసి చాలా ఏళ్ళయింది. అసలీ రాష్ట్రమే వదలేసి బతికింది ఇన్నాళ్ళూ.

"ఆ ఐదుగురూ మాటాడి వచ్చేస్తే తర్వాత మనమే." రవి ఉత్సాహంగా అన్నాడు లాన్‌లో కూచున్న మనుమలని చూపిస్తూ.

ఓ గవర్నమెంట్ అధికారికి .... అతనెంత గొప్ప ఆఫీసరయినా గాని ఇంత డిమాండా? అవినీతికి ఇంత ఆర్భాటంగా పట్టం కడుతున్నారా జనమంతా? లేక న్యాయానిక్కూడా గత్యంతరం లేక రవిలాంటి వాళ్ళు అన్యాయపు దారుల్లో వెదకడానికి వస్తున్నారా?

ఎందుకో అనుకోకుండా శ్రీనివాస్ గుర్తుకొచ్చాడు. అటువంటి వ్యక్తుల నిజాయితీ, నిర్భయం గొప్ప కాంతితో ఎంతో మందికి వెలుగు చూపిస్తాయి. చాలా జాగ్రత్తగా అతన్తో స్నేహం కాపాడుకుంటూ వచ్చిన తను ఏదో అలసత్వంతో బ్రేక్ తెచ్చుకుంది. జీవిత ప్రవాహంలో ఈదుకుంటూ ఎవరెక్కడ నిలబడ్డారో తెలియనంత గ్యాప్ ఏర్పడిందీ పదేళ్ళలో.

కుళ్ళిన వ్యవస్థకు మందువేసి కట్టుకట్టగలిగేది శ్రీనివాస్ లాంటి దీక్షాపరులే. ఈ రవికి అతని గురించి చెప్పాలి. కొంత టైమ్ పాసవుతుంది. రవికి ఇంకాస్త ప్రపంచం తెలుస్తుంది.

సునీత కబుర్లలోకి దిగేసరికి రవికి ఉత్సాహం పొంగుకొచ్చింది. బుద్ధిగా చెవులు రిక్కించాడు.

* * * * *

అధికారి గదిలోంచి కేకలు వినిపిస్తున్నాయి. ఎదురుగా ఎవరున్నారో తెలియడం లేదు. సునీత కుతూహలంగా, భయంగా హాల్లో అందరివైపూ చూసింది. కళ్ళతో కొంతమంది మాటాడుకుంటున్నారు.

కాస్సేపటికి ఇంకో గొంతు ముందు మెత్తగా, మంద్రంగా సాగి ఆ తర్వాత తీవ్రమయింది.

"ఎందుకొచ్చిన సంధిపేలాపన? రాత్రింబవళ్ళూ చాకిరీ చేస్తాడుగాని వీడు తినడు, ఇంకొకరికి పెట్టడు. అయ్యగారు అన్నారంటే అనరా!" సీనియర్ క్లర్క్ ఈశ్వర్రామ్ మెల్లగా గొణిగాడు.

"అసలా చెక్‌పోస్టు దగ్గర్నించి లాగేస్తే సరి." ఇంకొకతను అన్నాడు. సునీత కళ్ళు ఆగంతుకుడి కోసం చూశాయి. ఈ ఆఫీసులో చేరి నెలే అయింది. స్టాఫంతా తమాషాగా ఉన్నారు. తమకన్నా పైవాళ్ళతో అతి వినయంగా మెలగడం, కిందవాళ్ళ మీద కేకలేయడం తప్ప ఎవరికీ సొంత వ్యక్తిత్వం ఉన్నట్లు లేదు.

సన్నగా, పొడుగ్గా ఉన్న ఒకతను విసురుగా వచ్చి ఓ మూలకి వెళ్ళి సొరుగు లాగి తర్వాత ఏదో రాయడం ప్రారంభించాడు. అతని మొహం సరిగ్గా కనపడడం లేదు. బట్టలు నలిగున్నాయి. క్రాపు చెదిరిపోయింది. అలా లంచ్ అవర్ వరకూ అతనేదో మధ్య మధ్య చూస్తూ డ్రాఫ్ట్ చేస్తూనే ఉన్నాడు. ఒకసారి ఏదో టైప్ చేసుకున్నాడు చాలా స్పీడుగా.

'ఎవరూ పరిచయం చేయరే.' సునీత స్తబ్ధుగా ఉన్న కొలీగ్స్‌ని మనసులో విసుక్కుంది. లంచ్ అవర్‌లో తనే వెళ్ళి పరిచయం చేసుకుంది.

అతను బదులుగా నిర్లిప్తంగా నవ్వాడు.

"మీరు రోజూ ఆఫీసుకి రానక్కర్లేదా?"

"చెక్‌పోస్ట్ డ్యూటీ నాది. అయినా, ఏదో ఒక టైమ్‌లో ఇక్కడకొచ్చి కొన్ని సబ్‌మిట్ చేయాలి. పైగా, పదిహేను రోజులు లీవ్‌లో ఉన్నాను."

సంభాషణ ఎలా పొడిగించాలో తెలియలేదు. శ్రీనివాస్‌ది ఎక్కువగా మాటాడే స్వభావం కాదని పిస్తోంది. నిరాశగా తన టేబిల్ దగ్గరకి నడిచింది. ఆఫీసు మొత్తానికి తనొక్కతే లేడీ క్లర్క్. అందరూ పిల్లల చదువుల గురించో, కుటుంబ సమస్యల గురించో, వసూళ్ళ గురించో మాటాడతారు గాని ఇంకే టాపిక్స్ మాటాడరు. తెలిసీ తెలియని రాజకీయాలు మాత్రం అందరూ మాటాడతారు. ఇంక ప్రపంచంలో ఏ అద్భుతాలూ, అందాలూ వాళ్ళని కదలించవు. ఇలా ఎంతకాలం వీళ్ళందరి మధ్యా ఉద్యోగం చెయ్యాలో! సునీత మెల్లగా నిట్టూర్చి డ్రాయర్ లాక్‌చేసి బయటకు నడిచింది. చెరువు పక్కనే తారురోడ్డు. ఏపుగా పెరిగిన చెట్లు, అక్కడక్కడా ఇప్పుడిప్పుడే కొత్తగా కడుతున్న ఇళ్ళు. ఆ రోడ్డు మీద చల్లగాలి పీలుస్తూ అలా ఎంత దూరమయినా నడవాలనిపిస్తుంటుంది. ఎందుకో మనుమలకు ఈ డబ్బు, అశాంతి, రకరకాలుగా తగిలించుకునే బాధలు తప్ప ఇంకేమీ పట్టవు అనుకుంటూ చెరువు వైపు చూసింది.

తామరపువ్వులతో, ఆకులతో నిండుగా, నిశ్చలంగా ఉంది. అవతలి గట్టున చిన్న గుడి. ఇంకోవైపు చెరువు మీదగా వాలిన దిరిసెనచెట్ల కొమ్మల నీడలు. ఆమె అలాగే నిలబడిపోయింది.

ఇంతలో ఆమె ఏకాగ్రతని భంగపరుస్తూ ఓ సైకిల్ రివ్వుమని వచ్చి ఒంపు తిరిగి చెరువుగట్టునే అవతలి వైపుకు దూసుకుపోయింది. చారల షర్టు, అస్పష్టంగా కనిపిస్తున్న మొహం. అతను తను పరిచయం చేసుకున్న శ్రీనివాస్ అని ఆలస్యంగా గుర్తించింది. ఆ సైకిల్ అలా వెళ్ళి వెళ్ళి చెట్ల మధ్య మాయమయింది. ఇంకా దూరంగా ఇళ్ళూ డాబాలూ కనిపిస్తున్నాయి. ఇతనూ విలక్షణంగా, విచిత్రంగా ఉన్నాడు వీళ్ళందరిలో. కానీ, స్నేహశీలి కాదు. నిట్టూర్చి ఇంటివైపు దారి తీసింది.

ఒకరోజు సునీత ఫైల్స్ కట్టేస్తుండగా కొలీగ్

చిత్రాలు: పి.ఎస్. బాబు



నారాయణ కొంత డబ్బు చేతిలో పెట్టాడు.

"ఎందుకండీ? డబ్బులేమిటి?"

"ఈరోజు కలక్షన్."

"ఏం కలక్షన్!"

"మీ సీటు ఎంత గొప్పదో మీకు తెలియదు. ఇక్కడో ఆచారముంది. ఎవరి సీటులో ఎంతొచ్చినా ఈ సెక్షన్‌లో అందరూ సమానంగా పంచుకుంటాం. మీరు లేడీ కదా. పైగా కొత్త. అందుకే ఆ పార్టీ వాళ్ళు డబ్బులు మన హెడ్‌గుమాస్తాగారి చేతిలో పెట్టేసి వెళ్ళారు." అతను సౌమ్యంగా వివరించాడు.

సునీతకు విషయం పూర్తిగా అర్థమయింది.

మొహం ఎర్రబడింది. లంచాలు తీసుకునేటందుకు ఎవరి కారణాలు వాళ్ళు చెప్పుకుంటూ తమ చర్యలు సమర్థించుకున్నా అసలా పద్ధతే చాలా అనారోగ్య కరమయిందీ, నీచమయిందీ అని సునీత నమ్మకం. కానీ, వీళ్ళెవరూ వినిపించుకునే పరిస్థితిలో ఉండరు ప్రస్తుతం.

"చూడండీ."

అతను వెనక్కి తిరిగాడు. డబ్బు అతనికే ఇస్తూ "నాకు జీతమొస్తోంది నేను చేసే పనికి. ఇటువంటివి వద్దు" అంది కష్టంగా.

"కొత్తలో అందరూ ఇలాగే అంటారు."

"కావచ్చు."

"నేను సర్వీస్‌లో చేరిన ఐదేళ్ళవరకూ దాదాపు ముట్టుకోలేదు." నారాయణ డబ్బుతో వెనక్కి తిరిగి హెడ్‌గుమాస్తా దగ్గరకి నడిచాడు. "ఇవన్నీ మేం వల్లించిన డైలాగ్సేలే." హెడ్‌గుమాస్తా గొంతు వినిపించింది. సునీతకీ పరిస్థితి ఇబ్బందిగా అనిపించింది. అందరూ వయసులో, సర్వీస్‌లో తనకన్నా చాలా పెద్దవాళ్ళు. ఏం మాటాడగలదు? ఎందుకో మనసులో శ్రీనివాస్ మెదిలాడు. అతను చాలా నిక్కచ్చిగా ఉంటాడు కాబట్టే ఏ అధికారికీ అతనంటే సరిపడదని అందరూ అనుకుంటూ ఉంటారు. అతనొక్కడే తనని అర్థం చేసుకోగలడేమో ననిపించింది ఎందుకో.



"అమ్మాయ్ రేపు 8 ని వస్తున్నారు. పొద్దున్నే రావాలి అందరం." సూపర్నెంట్ గుర్తు చేశాడు.

"ఆదివారం కదా."

"గవర్నమెంట్ సర్వెంట్స్‌కి ఆదివారాలేమిటి? అవసరమయితే ఉయ్ ఆర్ ఆల్వేస్ ఎట్ దైర్ డిస్పోజల్" అన్నాడు.

అదేమిటో సాయంత్రం ఐదయ్యాక అందరూ సీరియస్‌గా పని మొదలుపెడతారు. ఆఫీసర్స్ కూడా ఇష్టమొచ్చిన టైమ్‌లో వస్తుంటారు. వాళ్ళు వెళ్ళేవరకూ గుమాస్తాలు కదలరు. ఆమె ఆలోచిస్తూ నిలబడుండగా శ్రీనివాస్ హడావుడిగా వచ్చాడు. చేతిలో ఏవో పుస్తకాలున్నాయి.

"ఏమోయ్ శ్రీనివాస్! రాత్రేమిటి మీ వీధిలో మీటింగ్ పెట్టి హోరెత్తించేశావుట. గవర్నమెంట్ ఉద్యోగివి - నీకు ఈ ఉద్యమాలేమిటోయ్!" హెడ్ గుమాస్తా చనువుగా, హాస్యంగా అన్నాడు.

"అన్యాయాలు జరుగుతున్నంత కాలం ఉద్యమాలు, పోరాటాలు తప్పవు సార్."

"మీకేం బాధయ్యా? హాయిగా స్కాలర్‌షిప్‌లూ, చదువులూ, ఉద్యోగాల్లో రిజర్వేషన్లూ?" సాగదీస్తూ

> **పైవాళ్ళ పట్ల అతి వినయం ప్రదర్శించడం, కిందవాళ్ళ మీద కేకలేయడం తప్ప ఇక్కడ ఎవరికీ సొంత వ్యక్తిత్వం లేదు.**

అదో రకంగా నవ్వాడు.

శ్రీనివాస్ ఏమీ సమాధానం చెప్పలేదు. ఇవన్నీ తనకలవాటే అన్నట్టు తాపీగా ఫైల్స్ చూస్తూ కూచున్నాడు. సునీత మాత్రం ఆశ్చర్యంగా చూసింది. అతను చకచకా రాసుకుంటున్నాడు.

"ఫార్వర్డ్ కాస్ట్‌లో పుట్టినందుకు అన్నిటికీ కరవే. ఈ గవర్నమెంట్ ఉన్నంతకాలం దేనికి నోరెత్తాలన్నా భయమే." నారాయణ అన్నాడు.

సునీతకెందుకో కోపం వచ్చింది నారాయణని చూస్తుంటే. కులాలనీ, గవర్నమెంట్‌నీ సునాయాసంగా విమర్శించే వ్యక్తి తన వ్యక్తిగతపు జీవితంలో ఎన్ని రకాలుగా దిగజారడానికైనా సిద్ధమే. పైగా, అదే "నేటి నీతి" అని ఓ బలమైన కొత్త వాదం లేవదీస్తుంటాడు.

శ్రీనివాస్ రిజర్వ్‌డ్ క్యాండిడేట్ అనుకోవడం తనకు ఆశ్చర్యంగానే ఉంది. ఎందుకో అసలా ఊహే రాలేదు. సంకోచం వదలి మెల్లగా అతని దగ్గరకి నడిచింది.

"మీరు పుస్తకాలు బాగా చదువుతారా?"

"ఒకప్పుడు. ఇప్పుడు నేనెక్కువగా అంబేద్కర్, మార్క్స్.... ఇంకా కొన్ని చారిత్రక, సామాజిక పరిణామాలని కళ్ళముందుంచే సాహిత్యం వైపు తిరిగాను."

"నాకూ ఇస్తారా?"

"తప్పకుండా." అతను కొన్ని పుస్తకాలు బ్యాగ్ లోంచి తీసి ఇచ్చాడు. ఆ పుస్తకాలందుకుంటూ ఆరాధనగా చూసింది. అతని మొహంలో ఏదో అస్పష్టమైన వేదన, పట్టుదల, నిశ్చలత్వం తప్ప మామూలుగా యువకులకుండే కొంటెతనం, కుతూహలం మచ్చుకయినా లేవు.

థాంక్స్ చెప్పి వెళ్ళొస్తానని చెప్పబోయేముందు ఆగి తటపటాయింపుగా అంది: "మీరేం అనుకోకపోతే ఒక మాట. మీరసలు రిజర్వ్‌డ్ క్యాండిడేట్‌లా ఉండరు."

"అంటే..." శ్రీనివాస్ సూటిగా చూశాడు.

"అంటే..." సునీత ఏదో చెప్పబోయి తడబాటుతో గొంతు పెగలక ఇబ్బందిగా చూసింది. తీవ్రంగా, బాధగా ఉన్నాయి అతని చూపులు.

"కులం పేరు ఏదైనా మొహాల మీద ఏమయినా రాసుంటుందా మేడమ్?"

"ఐయామ్ సారీ, నా ఉద్దేశం అది కాదు."

"అందరూ అలా పైకి అనేవాళ్ళే. కానీ, అంతరాంతరాల్లో మాత్రం ఓ హరిజనుడుగాని, గిరిజనుడుగాని సమాన స్థాయిలో ఉంటే అసలేమాత్రం యాక్సెప్ట్ చేయలేని వ్యతిరేకత."

"నే..నే..నా ఉద్దేశం అది కాదు." సునీత తనని తాను తిట్టుకుంటూ బాగ్ సర్దుకుని బయటకొచ్చి రిక్షా కోసం నిలబడింది.

"వాడంతే. తిక్కవెధవ. పైగా, ఆ బుద్ధులెక్కడికి పోతాయి? వాడి జోలికి పోబోకమ్మా." హెడ్‌గుమాస్తా రామశర్మ సిగరెట్ దమ్ము పీలుస్తూ సునీత పక్కనే నిలబడ్డాడు. సునీత మనసు అసలే బాగోలేదు. ఈ సన్నాయి నొక్కులు అసలే సరిపడవు. అతనివైపు కనీసం చూడనైనా చూడకుండా ఖాళీగా పోతున్న రిక్షా ఆపి ఎక్కి కూచుంది.

కలతపడిన మనసుని స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి అంబేద్కర్ 'హు ఆర్ అన్‌టచబుల్స్' చాలా దీక్షగా పొద్దుపోయేవరకూ చదివింది. ఆ మర్నాడు ఆమె క్షమార్పణ, ఆ తర్వాత ఆమె మరికొన్ని పుస్తకాలు అడగడం, చదివి ఎప్పటికప్పుడు చర్చించడానికి ఉత్సాహం చూపించడం శ్రీనివాస్‌లో గంభీరతని పూర్తిగా పోగొట్టి సన్నిహితమయ్యేలా చేశాయి. చాలా విషయాలు మాటాడుకునే పరిజ్ఞానం ఇద్దరికీ పుష్కలంగా ఉంది.

ఆ స్నేహం చాలా విడ్డూరంగా అనిపించసాగింది స్టాఫ్‌కి. 'వాడు చాలా డేంజరస్' అని హెచ్చరించారు. కోపగించుకున్నారు. పై అధికారి దృష్టిలోకి కూడా వెళ్ళింది. ఆయనేదో అనబోయి సునీత సూటిదనం, నిర్భయం చూసి మనకెందుకులే అన్నట్టు విషయం మార్చేశాడు.

తన అనుభవాలనీ, డిపార్ట్‌మెంట్‌లో గొడవలనీ ఎప్పటికప్పుడు ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్న భర్త శివరాంకి రాస్తూనే ఉంది. శివరాంకి భార్య సంస్కారం మీద ఎంతో విశ్వాసం. అతని విశ్వాసం సునీతకి ఎంతో మనఃస్థైర్యాన్నీ హుందాతనాన్నీ ఇస్తుంటుంది.

స్నేహం ఏపుగా పెరుగుతూ, ఎన్నెన్నో విషయాలని సరికొత్త కోణాల్లో చూపిస్తూ మంచి ఆరోగ్యాన్ని పుంజుకుంటోంది.

"ఒక వర్గం తరపున శ్రమించడమంటే సమాజంలో మిగిలిన కులాలకీ, ఆర్గనైజేషన్స్‌కీ దూరంగా ఉండడం కాదు. ఎందుకా కాంప్లెక్స్? మీరు అందరితో ఫ్రీగా, హాయిగా మసలకపోతే మీ సమస్యల గురించిన విచక్షణ మిగిలిన కులాలకి ఎలా వస్తుంది?"

సునీత ప్రశ్నకు బదులుగా విరక్తిగా నవ్వాడు. "డబ్బూ, కులాలు తప్ప ఇంకేమీ ప్రకటించుకోలేని ఈ అతిశయవరులతో ఏం మాటలుంటాయి? సానుభూతిగా ఏం పంచుకుంటారు వీళ్ళు?"

"వాళ్ళలోనూ నిద్రపోతున్న మానవత్వపు విలువలుంటాయి. ఎంతో మంచితనముంటుంది."

"నేను నమ్మలేను."

"అదే మరి న్యూనతాభావమంటే. సమస్యల మీద పోరాటమంటే ఇతరులని ద్వేషించడం కాదు."


"నేను ద్వేషించను. వాళ్ళ అల్పత్వాన్ని దూషిస్తాను."

"అదికూడా వద్దు. మీ ఆత్మవిశ్వాసంతో, స్నేహానురాగాలతో వాళ్ళందరికీ కేవలం శ్రీనివాస్‌లా మంచి స్నేహితుడిగా దగ్గరవండి."

"అందరూ మీలా ఉండరు." అతను ఆరాధనగా చూశాడు.

"కావచ్చు కానీ, ఆ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ వదులుకొంటే మీరేమిటో అందరికీ తెలుస్తుంది. అప్పుడప్పుడూ మన బాస్‌తో వాదం వేసుకుని మంచి ఇంగ్లీష్‌లో నోర్మూయించడమే కాదు."

అతను చాలా ప్రశాంతంగా నవ్వాడు. సునీత స్నేహ వీచికలు అతన్ని చాలా సేదదీరుస్తున్నాయి. "ఇంకేం చేయాలి మరి?" అన్నాడు ఆమె వైపు



అభిమానంగా చూస్తూ నవ్వి.

"కలుపుగోలుగా ఉంటూనే చురకలు అంటించాలి."

హెడ్‌గుమాస్తాగార్కి ఆ ఇద్దరి పద్ధతి అస్సలు నచ్చడం లేదు. "ఏమయ్యోయ్ నీ గ్రూప్ టూ సర్వీస్ రిజల్ట్స్ వచ్చాయి చూసుకున్నావా?" అన్నాడు అసహనంగా.

అందరూ ఆయన చుట్టూ చేరారు. శ్రీనివాస్ పేరుంది. కంగ్రాట్స్ చెబుతూనే "నీకేమిటోయ్" అన్నాడు ఎకసక్కెంగా.

"మనోడు పెట్టి పుట్టాడు. చిన్న వయసులోనే ఉద్యోగంలో చేరాడు. రేపో మాపో గెజిటెడ్ ఆఫీసరు కాబోతున్నాడు."

"మన డిపార్ట్‌మెంట్‌కే వస్తాడేమో!"

"వచ్చినా రావచ్చు."

"ఏమయినా ఈ రోజుల్లో రిజర్వేషన్ ఉన్న వాళ్ళదే రాజ్యం." ఇలా రకరకాల వ్యాఖ్యానాలతో అభినందనలు తెలుపుతుండగా పైనుంచి దొరగారు దిగారు. ఏమిటని అన్నారు సీరియస్‌గా చిరునవ్వు చిందిస్తూ. శ్రీనివాస్ నమ్రతగా చెప్పాడు.

"వెరీ గుడ్. రిజర్వేషనుంది. ఈజీగా అయిపోతావులే. అప్పుడయినా తెలుసుకుంటావు గెజిటెడ్ ఆఫీసర్స్ తిప్పలేమిటో." ఆయన వెళ్ళిపోయాడు.

ఆ సందడంతా లంచ్ టైమ్‌కి సద్దుమణిగింది. శ్రీనివాస్‌ని చూస్తూ మధ్య మధ్య ఆలోచిస్తోంది సునీత. నిజానికామెకి అతను రిటెన్ టెస్ట్‌లో సెలెక్ట్ కావడం చాలా ఆనందంగానే ఉంది. కానీ, స్టాఫ్ చేసిన హడావుడిలో మెచ్చుకోలుకన్నా ఈర్ష్య, అసూయలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. చుట్టూ చూసింది. అందరూ లంచ్‌కి వెళ్ళారు. మెల్లగా అతని టేబిల్ దగ్గరికి నడిచింది. ఏమిటన్నట్టు ఆత్మీయంగా నవ్వాడు.

"అయితే, వెళ్ళిపోతారన్న మాట."

"ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవ్వాలి కదా ఇంకా."

"అవుతారు మీరు."

"రిజర్వేషన్‌తోనా?" సరదాగా అన్నట్టు అని ఆమెవైపు చూసి "ఐయామ్ సారీ" అన్నాడు లాలనగా.

"మీరు ఎమ్.ఎ చేశారు. మీ డ్రాఫ్టింగ్, మీ స్పీడ్ వర్క్ మీరంటే పడని వ్యక్తులు కూడా మెచ్చుకుంటారు. ఇంగ్లీషులో మంచి కమాండ్ ఉంది. యు ఆర్ ది మోస్ట్ కేపబుల్ అండ్ క్వాలిఫయిడ్ మేన్ హూమ్ ఉయ్ ఆల్ యాక్సెప్ట్. కేవలం అక్కసుతో, కుసంస్కారంతో కనీసం డిగ్రీ అయినా చేయని వీళ్ళంతా రకరకాలుగా పేలుతుంటే ఆత్మగౌరవం కాపాడుకోవడం మాత్రం తెలియడం లేదు."

"సునీతా!"

"ఎందుకా సహనం? ఎందుకు వాళ్ళంతా అలా పెట్రేగి మాటాడే అవకాశమిస్తారు?"

అతను మంత్రముగ్ధుడిలా చూశాడు. ఆమె అంతకుమించి తను చెప్పేదేమీ లేదన్నట్లు తన సీటుకు వచ్చి ఏదో ఫైల్ తీసుకుని దీక్షగా చూడసాగింది.

లంచ్‌కి వెళ్ళినవారంతా ఒక్కొక్కరే రావడం ప్రారంభించారు. "ఏమోయ్ రిజర్వేషన్ పెళ్ళికొడుకా!" ఇంకో ఆఫీసరు సూపర్నెంట్ రూంలో కూర్చుని హుషారుగా కేకేశాడు.

శ్రీనివాస్ మర్యాదగా లేచి వాళ్ళ దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు.

"పరాంకుశం చెప్పాడు అయ్యావని. ఆల్ ది బెస్ట్. నీకేం - తంతే బూర్లగంపలో పడ్డట్టు రిజర్వేషన్ ఒడిలో పడ్డావ్."

"వాళ్ళకున్న అదృష్టం మనకేదీ? నువ్వు రెడ్డివి, నేను పనికిమాలిన బ్రాహ్మణ్ణి" - సూపర్నెంట్ నవ్వాడు తమాషాగా.

"డూ యూ వాంట్ టు కన్వర్ట్ యువర్‌సెల్ఫ్ యాజ్ యస్.సీ." శ్రీనివాస్ గొంతు ఖంగుమని మోగింది. అందరూ విచిత్రంగా చూశారు. అతని చూపులు తీక్ష్ణంగా ఉన్నాయి.

"యస్. మీ అందర్నీ ప్రశ్నిస్తున్నా అడుగుతున్నా రిజర్వేషన్ ఉన్నవాళ్ళు చాలా ఆనందంగా, వైభవంగా ఉన్నారు. మీ పిల్లలకీ, చెల్లెళ్ళకీ, తమ్ముళ్ళకీ కులాంతర వివాహాలు చేయండి. రిజర్వేషన్స్ పొందండి. కులాలు మార్చుకోండి. ఏమంటారు?" రెట్టించాడు.

ఎవరి మొహాల్లోనూ కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. "ఏమిటీ పెద్దంతరం చిన్నంతరం లేకుండా" అన్నాడు హెడ్‌గుమాస్తా రామశర్మ నుదురు చిట్లిస్తూ.

"నేనూ ఇక్కడ ఓ చిన్న ఆఫీసర్నే అయినా, నేను మీ అందరి మీదా బాసిజమ్ చేయలేదు. బడాయిలు పోలేదు."

"పోనీయవోయ్. ఏదో సరదాగా అన్నాం. ఎందుకంత సీరియస్ అవుతావ్!" ఆ ఆఫీసరు నవ్వడానికి అవస్థపడుతూ శ్రీనివాస్ భుజం మీద చనువుగా చరిచాడు.

"మీకెవ్వరికీ దళితుల సమస్యల గురించి చెప్పను. కానీ, ఈ ప్రివిలేజనన్నీ చాలా సులభంగా మీరు కులాలు మార్చుకోవడం వల్ల ఎంజాయ్ చేయగలరని చెబుతున్నాను.

"రేపు మన పిక్నిక్ గురించి మాట్లాడదామని అసలు పిలిచానోయ్. వెధవది నా నోరు ఆగక, ఏదో కుర్రాడివని సరదాగా అన్నాను." సూపర్నెంట్ తెలివిగా విషయం దాటించి అందరినీ పిలిచి పిక్నిక్ విషయం చర్చించడం మొదలెట్టాడు.

ఆరోజు శ్రీనివాస్ కళ్ళలో వెలుగు ... ఆ వెలుగు తనకిచ్చిన అనంతమైన తృప్తి. సునీతకి ఈనాటికీ ఆ దృశ్యం చాలా హాయిగా, ఫ్రెష్‌గా అనిపిస్తుంటుంది. గొప్ప ఇన్‌స్పిరేషన్‌గా పని చేస్తుంటుంది.

పిక్నిక్‌లో జరిగిన అనూహ్యమైన సంఘటన

**తర్వాత ఆమె మరికొన్ని పుస్తకాలు అడగడం, చదివి చర్చించడానికి ఉత్సాహం చూపడం శ్రీనివాస్‌లో గంభీరతను పోగొట్టి సన్నిహితం చేశాయి.**

శ్రీనివాస్ పట్ల ఆఫీసులో అందరి వైఖరీ మార్చేటట్టు చేసింది. చెప్పకుండా వెళ్ళి సరదాగా బల్లకట్టు ఎక్కిన ఉద్యోగస్థుల పిల్లలు ముగ్గురు నీళ్ళలో పడి పోయారు. ఈత రాక గుండెలు బాదుకుంటున్న సూపరిన్టెంట్, హెడ్‌గుమాస్తా, ఇంకా తదితరులకు ధైర్యం చెప్పి కాలవలో దూకి ఒక్కొక్కర్నే ఒడ్డుకు చేర్చాడు శ్రీనివాస్. పిల్లలకేం కాలేదు. కొంచెం బెదిరారు. నీళ్ళు తాగారు- అంతే.

తడిసిన బట్టలతో నీళ్ళు కారుతూ నిలబడున్న శ్రీనివాస్ పాదాల మీద వాలిపోయారు సూప ర్నెంట్, హెడ్‌గుమాస్తాలు.


"ఛా ఛా ఏమిటండీ? ప్లీజ్ ... ప్లీజ్ సార్ ..."

లేచి కన్నీళ్ళతో కౌగిలించుకున్నారు. సునీతకి, ఇంకా మిగిలిన వాళ్ళకి ఆ దృశ్యం చూస్తుంటే కన్నీళ్ళు జాలువారాయి. కేవలం మానవత తన ప్రభావంతో అందర్నీ సమీకరించిన అద్భుతమైన దృశ్యచిత్రమది. అంతరంగాలు ఆత్మీయతగా పెనవేసుకున్న ఉన్నత మైన క్షణాలు.

"శ్రీనివాస్, మేమేం ఆలోచించా మన్నది ఇప్పుడు చెప్పం. కానీ, మా కళ్ళు తెరిపించడానికే ఆ భగవంతుడు మమ్మల్నిలా పరీక్షించా డనుకుంటాం. నీకు దేవుడంటే నమ్మకం లేకపోవచ్చు. కానీ, ఇది వాడి లీలే. మా మిగిలిన జీవితం సక్రమంగా, న్యాయంగా సాగిస్తూ నీలాంటి దళిత రత్నాల పట్ల సరయిన అవగాహనతో బతుకుతూ సహకరిస్తూ ఉంటామని వాగ్దానం చేస్తున్నాం. అదే నువ్వు మా పిల్లలని రక్షించినందుకు మేం చెల్లించే మూల్యం. మా పిల్లలకి మేము అందించబోయే అమూల్యమైన సంపద."

ఈసారి ఆవేశంగా శ్రీనివాస్ వాళ్ళని కౌగిలించుకున్నాడు.

**తడిసిన బట్టలతో నీళ్ళుకారుతూ నిలబడున్న శ్రీనివాస్ పాదాల మీద వాలి పోయారు సూపర్నెంట్, హెడ్‌గుమాస్తాలు.**



* * * *

"రమ్మంటున్నారు."

ప్యూన్ వచ్చి చెప్పడంతో తేరుకున్న రవి "చాలా... అబ్బ... ఫెంటాస్టిక్ ఆంటీ" అన్నాడు నడుస్తూ.

సునీత నవ్వి "అటువంటి వ్యక్తితో కలసి పనిచేసి నందుకు నా జన్మ ధన్యమయిందని అనుకుంటూ ఉంటాను. ఎందుకంటే ఆ కాస్త అనుభవాలూ నా జీవితాన్ని తద్వారా నా పిల్లలని చాలా ప్రభావితం చేశాయి. ఎంతోమంది నీలాంటి కుర్రాళ్ళకి శ్రీనివాస్ గురించి కథలుగా చెప్పాను" అంటూ రవితో పాటు లోపలికి నడిచింది.

కార్పెట్ మధ్య ఆఫీస్ టేబుల్. ఎదురుగా చాలా కుర్చీలు. "ప్లీజ్ బీ సీటెడ్" అన్నాడు ఆయన కళ్ళజోడులోంచి చూస్తూ.

"ఈమె మా ఆంటీ సునీత." రవి బిడియంగా కూచున్నాడు.

'అహః' అంటూ తల వంకించి సునీతవైపు యథాలాపంగా చూస్తూ "మీరూ..." అన్నాడు సంభ్రమంగా మళ్ళీ పరిశీలిస్తూ.

గదిలో క్షణంసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది. అతని మొహం ప్రసన్నంగా మారుతోంది.

"మీరు శ్రీనివాస్ అని కలలో కూడా ఊహించ లేదు." సునీత వణకుతూ లేచి నిలబడి "శే రవీ" అంది.

"ప్లీజ్ సునీతా ... అసలెందుకు వచ్చారు? ఎందుకు కోపం తెచ్చుకుంటున్నారు? మనం పదేళ్ళ బట్టీ కలవలేదు. ఈ ఇరవయ్యేళ్ళలో మొదటి పది సంవత్సరాలూ చాలాసార్లు కలిశాం కదూ? మీవారూ, పిల్లలూ కులాసానా? ఎక్కడున్నారు మీరంతా? ఎంత కాలమయిందీ?"

"శివరాం వార్‌లో పోయాడు." నిర్లిప్తంగా అంది. "ఈ రవి తల్లి నా ఫ్రెండ్. ఏదో రేటు మాటాడాలి ఆఫీసర్‌తో అంటే అదేమిటో విని మీలాంటి వాళ్ళని దులుపుదాం అని వీడితో వచ్చాను. పాపం వీడికి కూడా నేనెందుకు తోడుగా వచ్చానో తెలియదు."

"ఆంటీ ప్లీజ్." కంగారుగా చూశాడు రవి.

శ్రీనివాస్ అతి కష్టం మీద తనని తాను సంబాళించు కున్నాడు. ఇటువంటి పరిస్థితి అంటూ ఒకటి ఎదురవుతుందని కలలో కూడా ఊహించలేదు. సునీత ఆగమనం వేసవిలో పిల్ల తెమ్మెరలా ఉంది. కానీ, ఈమె ధాటి, దూకుడు తనని బలహీన పరుస్తున్నాయి. అగాధంలోకి తోసేస్తున్నాయి.

"ఈ రవి తండ్రి యాక్సిడెంట్‌లో మరణించాడు. అంతేకాదు, ఈ రవి కూడా రిజర్వ్‌డే....అంటే.."

"ఇక్కడ రిజర్వేషన్‌తో పనిలేదు. అయినా, మీ తాలూకా అని చెబితే నేనిలా.." ఇబ్బందిగా కది లాడు. నవ్వబోయాడు.

"మా తాలూకా కాకపోతే దోపిడీ చేస్తారా? ఈ దోపిడీలో ఎటువంటి సంకోచాలూ లేవా? మీరు చూపించిన మరో ప్రపంచంలో నేను చైతన్యమయి, ఎంతో పదిలంగా మీ స్నేహానుభూతుల్ని నా సన్ని హితులకి వినిపించి, మిమ్మల్నో ఆదర్శవంతమైన పురుషునిగా చిత్రీకరించుకున్నాను. మీరిలా.. మీ భార్య అలా... ఓహ్! వితంతువుని చేసుకున్నానని చెబితే ఎంతో అభినందిస్తూ ఉత్తరం రాసి ఆ తర్వాత స్టేషన్‌లో మీ ఇద్దర్నీ కలిశాను. మీ ఆదర్శాలకి ధనదాహం కళ్ళెం వేసింది. మీ సిద్ధాంతాల పునాదులతో స్టేటస్ సౌధాలు నిర్మించుకుంటున్నారు."

"జెలసీతో మాట్లాడకు." కఠినంగా 'అన్నాడు.

"జెలసీనా?"

"అవును. మీలాగా చాలామంది జెలసీతో నా మీద ధ్వజమెత్తుతున్నారు."

"ఈ ఐశ్వర్యం, ఈ హంగూ - ఇవన్నీ మీ ఆదర్శాలని కబళించి మిమ్మల్ని మార్చివేశాయి. ఈ రోజు డబ్బు తప్ప కనీసం మీ జాతివాళ్ళు ఎన్ని దౌర్జన్యాలకు గురవుతున్నారో పట్టించుకోనంత దారుణంగా మీ కీర్తికండూతి మార్చివేసింది. అవకాశమొస్తే అందరూ అంతే అని నిరూపించారు. పైగా, అందరికీ జెలసీ అని ఆత్మవంచన..."

"ఆవు. ఎంత స్నేహాలు ఒలికించినా మీ అగ్ర కులాలకి మేం ఈ పొజిషన్‌కి చేరుకోవడం ఇష్ట ముండదు. ఏం అన్ని పదవులు, భోగభాగ్యాలు మీవేనా? పనికిమాలినవాళ్ళంతా రాజకీయాల్లో దిగగా లేనిది బాగా చదువుకున్న నా భార్య ఉంటే తప్పేమిటి? ఏమిటి మీ అభ్యంతరాలు?" విసురుగా అన్నాడు.

"నువ్వు...మీ...రు...ఆ శ్రీనివాసేనా?"

"యస్, ఆ మనిషినే. కాలంతోపాటు ఎదిగాను. మారాను. నా పొజిషన్ అటువంటిది. ఎన్ని టెన్షన్స్? ఎన్నెన్ని ఎదురుదెబ్బలు? ఇవన్నీ మీకు అర్థం కావు." ఆమె వైపు తిరిగి హఠాత్తుగా మృదువుగా కంఠాన్ని మార్చాడు. "చెప్పండి. వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ మై డియర్ ఫ్రెండ్."

"నథింగ్."

"ప్లీజ్."

"ఊ హూః... లెట్ మీ గో." సునీత దిగ్భ్రాంతిగా ముందుకు అడుగేసింది.

"ప్లీజ్ కూచోండి. ఈ అబ్బాయి ఫాదరేగా... అంతా నేను చూసుకుంటా...ఎప్పటికీ నేను మీ స్నేహితుడినే..."

"కాదు.కాదు..నువ్వు నా స్నేహితుడివి కాదు. నీ స్వరం... నీ ధోరణి.... నీ భావాలు అన్నీ మారి పోయాయి. ఈ కొత్త మనిషిని..... అబ్బా!..." పడి పోతున్న సునీత వైపు కంగారుగా నడిచారు రవీ, శ్రీనివాస్‌లు. ■